ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 22 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm



# స్పీకర్‌దే తుదినిర్ణయం

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు

హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై షెడ్యూలు ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టేసింది. సెప్టెంబరు 9న దీన్ని విచారించిన సింగిల్ జడ్జి.. 4 వారాల్లో అనర్హత పిటిషన్లపై షెడ్యూలు ఖరారు చేయాలని తీర్పు వెలువరించారు. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీళ్లపై ఇటీవల వాదనలు ముగియగా తీర్పును వాయిదా వేసింది. తాజాగా స్పీకర్ తీసుకోవాలంటూ శుక్రవారం ఉన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితోపాటు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూబీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్లను స్పీకర్ స్వీకరించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు.

### సంస్కృతి సంప్రదాయాల బలోపేతానికే

# లోక్ మంథన్



విదేశీ శక్తులు మనపై జులూం ప్రదర్శించాయి
దీంతో మన సంస్కృతి, భాష, సంప్రదాయాలు విధ్వంసం
రాష్ట్రపతి ముర్ము
శిల్పారామంలో లోక్ మంథన్ ప్రారంభం
హాజరైన మంత్రులు సీతక్క, జూపల్లి

హైదరాబాద్ : సంస్కృతి, సంప్రదాయాలు బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం లోక్ మంథన్ అని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం పాటిస్తామన్నారు. శిల్పారామంలో లోక్ మంథన్ కార్యక్రమాన్ని ముర్ము ప్రారంభించారు. మంత్రులు సీతక్క, మంత్రి జూపల్లి హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడారు. విదేశీ శక్తులు మనపై జులూం ప్రదర్శించాయన్నారు. మన సంస్కృతి, భాష, సంప్రదాయాలను విధ్వంసం చేశాయన్నారు. భారత దేశం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. 2018లో రాంచీ లోక్ మంథన్లో పాల్గొనని గుర్తు చేశారు. ఆర్ఆర్ఎస్ నేత మోహన్ భగవత్, కేంద్రమంత్రి బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు

# మనుమరాలి బర్త్ డే పార్టీలో బీరు బిర్యానీ



యువతితో మంత్రి సురేఖ మాట్లాడిన వీడియో వైరల్
కొండాపై మండిపడుతున్న నెటిజన్లు

హైదరాబాద్ : మంత్రి కొండా సురేఖ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. కొండా సురేఖ, ఓ మహిళ మధ్య జరిగిన సంభాషణ తాలూకు వీడియో ఒకటి నెట్టింట్లో తెగ వైరల్ అవుతోంది. అందులో ఓ యువతితో సురేఖ మట్లాడుతూ... ఈ రోజు మా అందరికీ పండుగ ఉంది. బిర్యానీలు తెప్పిస్తున్నాం.. చిన్న పాప పేరు తోటి, మా టీమ్ టీమంతా కూడా ఇవాళ ఫుల్ ఎంజాయ్. బిర్యానీ ఉంటే బీర్ ఉంటది కదమ్మా పాపం. అఫీషియల్ సెలేబ్రేషన్ అంటే అఫీషియల్‌గా ఇచ్చేది. ఇక అన్‌అఫీషియల్‌గా అంటే.. అన్నారు.

అలాగే మరో వీడియోలో ఎవరు ఎక్కువ డ్యాన్స్ చేస్తే వాళ్లకు మందు ఎక్కువ అని మంత్రి చెప్పడం ఉంది. అయితే ఈ వీడియోలను ఎవరో సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ గా మారాయి. దీంతో కొండా సురేఖపై నెటిజన్లు మండిపడుతున్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఇలా బీరు బిర్యానీ పార్టీ చేసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

### మహబూబ్‌నగర్‌లో

# బీసీ కమిషన్



మహబూబ్‌నగర్ : రాష్ట్ర బీసీ కమిషన్ మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బి.సి. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయ ప్రకాష్, తిరుమల గిరి సురేందర్, బాల లక్ష్మి బహిరంగ విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు పాల్గొన్నారు.

### ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా

# కాష్ పటేల్..?

వాషింగ్టన్ : అమెరికా అంతర్గత దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా కాష్ పటేల్ ను నియమించే అవకాశం ఉంది. ఈవిషయాన్ని సీఎన్ఎన్ పేర్కొంది. ఇక మాజీ ఏజెంట్ మైక్ రోగర్ పేరు ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచార సమయం నుంచే ప్రస్తుత డైరెక్టర్ క్రిస్టఫర్ వ్రేను తొలగించే అంశంపై ట్రంప్ కసరత్తు చేస్తున్నారు. దీంతో సెనెట్ ఆమోదముద్రను పొందగల అభ్యర్థి కోసం ఆయన గాలిస్తున్నారు. ఇప్పటికే అటార్నీ జనరల్‌గా తొలుత మాట్ గయిట్జ్‌ను ఎంపిక చేసి విమర్శల పాలయ్యారు. కాగా, గయిట్జ్ పదవిని తిరస్కరించడంతో.. ఫ్లోరిడాకు చెందిన పామ్ బోండిని ఎంపిక చేశారు.

### ఛత్తీస్‌గఢ్‌లో

# భారీ ఎన్‌కౌంటర్

10 మంది మావోయిస్టుల మృతి
పలు ఆయుధాలు స్వాధీనం

నవరాయపూర్ : ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలో మళ్లీ తుపాకుల మోతతో దద్దరిల్లింది. సుక్మా జిల్లాలో మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 10 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఒడిశా సరిహద్దులు దాటి ఛత్తీస్‌గఢ్ లోకి మావోయిస్టులు ప్రవేశించినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో దక్షిణ సుక్మా ప్రాంతంలో డీఆర్‌జీ బృందం శుక్రవారం తెల్లవారుజామున గాలింపు చేపట్టింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్న నక్కిన ప్రాంతాన్ని గుర్తించి చుట్టుముట్టింది. భద్రతా బలగాలను చూసి నక్సల్స్ వారిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది కూడా ఎదురుకాల్పులు జరిపారు. ఇప్పటివరకు 10 మంది మావోయిస్టుల మృతదేహాలు, మూడు ఆటోమేటిక్ రైఫిల్స్ సహా పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.



### ఆ హీరో నాతో అలా

# మాట్లాడాడు..

సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ కీలక వ్యాఖ్యలు

గతంలో ఓ సినిమా సెట్ లో..
ఈ ఘటన జరిగింది..

సినిమా: ''గతంలో ఓ సినిమా సెట్‌లో ఒక హీరో నాతో ఇబ్బందికరంగా మాట్లాడాడు. నాకు ఏదైనా ఛాన్స్ ఉందా? అన్నాడు. వెంటనే నేను నా చెప్పుల సైజు 41. ఇక్కడే చెంప పగలకొట్టనా? లేదా సెట్‌లో అందరి ముందు పగలకొట్టనా? అని అడిగా? సినిమా మాధ్యమంగా ప్రేక్షకులను అలరించాలని నేను పరిశ్రమలోకి వచ్చా. సమానత్వం, గౌరవంలో ఎక్కడా రాజీ పడకూడదనేది నా సిద్ధాంతం. ఆవిధంగానే వర్క్ చేశా'' సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ చెప్పారు. గోవాలోని పనాజీలో భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) వేడుకగా జరుగుతోన్న విషయం తెలిసిందే. తొలిరోజు జరిగిన వేడుకల్లో సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ పాల్గొన్నారు. 'సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ' అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల చర్చనీయాంశంగా మారిన ఈ టాపిక్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. ఆ హీరో ఎవరై ఉంటారా? అని మాట్లాడుకుంటున్నారు.

